# చిన్ని చిన్ని ఆశ

-శ్రీధర్ భద్రంరాజు

"అమ్మా! ఈవేళ స్కూల్‌కు వెళ్లనే" గారంగా అడుగుతున్న తన కూతుర్ని చూసి-

"ఎందుకు నాన్నా?" అడిగింది వాసంతి.

"మరి ఈ రోజు నాన్నగారు వస్తారుకదా! అందుకు..."

"నాన్నగారు వచ్చేసరికి మధ్యాహ్నం దాటుతుంది. నువ్వెందుకు స్కూల్ మానేయడం? పైగా ఎగ్జామ్స్ కూడా దగ్గర్లోనే వున్నాయి" మందలించింది వాసంతి.

"పోనీ లంచ్‌టైం వరకూ వెళ్లి వచ్చేయనా?" రాజీకొస్తున్నట్లు అడిగింది అలేఖ్య.

"ఏమీవద్దు. గొడవ చేయకుండా రెడీ అవు. నాకు టైం అవుతోంది" అంటూ పనిలో పడింది వాసంతి.

"మరి నువ్వు ఇంటికి తాళం వేసుకుని వెళ్తావు కదా. కీ పక్కింట్లో ఇచ్చినట్లు నాన్నగారికి తెలియదుకదా. అందుకని డాడీ వచ్చేసరికి నేను ఇంట్లో ఉండనా?" సాధ్యమైనంత లాజికల్‌గా అడిగింది అలేఖ్య.

"నాన్నగారి దగ్గర ఇంకో కీ వుంది. నువ్వు వచ్చేసరికి ఇంట్లోనే వుంటారు. విసిగించకుండా టిఫిన్ తిను. స్కూల్ బస్ వచ్చే టైం అయింది"

'నీ పప్పులు నా దగ్గరేం ఉడకవు' అన్నట్లు చూసి స్నానానికి వెళ్లింది వాసంతి. స్కూల్ ఎగ్గొట్టడానికి కారణాలు వెతుకుతూ నెమ్మదిగా టిఫిన్ తింటున్న అలేఖ్య "టిఫిన్ తినడం అయిందా?" అన్న తల్లి ప్రశ్నతో గబగబా టిఫిన్ ముగించింది.

"స్కూల్ బస్ వచ్చింది అలేఖ్యా. షూ వేసుకుందువు రా" వాసంతి పిలవడంతో తల్లి దగ్గరకు వెళ్లి-

"అమ్మా! ఈ రోజు మన గులాబీ పువ్వు పూసిందిగా" అడిగింది.

"ఊ" అంది వాసంతి అలేఖ్యకు షూ వేస్తూ.

"నాకివ్వు. నేను మా పోలీస్ అంకుల్‌కి ఇవ్వాలి"

"సరే" అంది వాసంతి.

అలేఖ్య వాళ్ల టీచర్ పోలీస్ పాఠం చెప్తూ 'పోలీసులు ఎవరికీ ఏమీ కాకుండా కాపాడతారనీ, దేశానికి సేవ చేస్తుంటారనీ' చెప్పిందిట. మంచి పనులు చేసేవారిని అప్పుడప్పుడూ పలకరించి ఏదైనా గిఫ్ట్ ఇవ్వడం మంచి అలవాటని చెప్పిందిట.

అప్పటినుండి అలేఖ్య వాళ్ల గులాబీ మొక్కకు పువ్వు పూసినప్పుడల్లా వాళ్ల స్కూల్‌కు దగ్గరలో వున్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడి పోలీసులతో కాసేపు కబుర్లు చెప్పి గులాబీ పువ్వు ఇచ్చి వస్తూ వుంటుంది.

చిన్నపిల్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం ఎందుకని కొత్తల్లో వాసంతి మందలించినా 'దానివల్ల స్నేహభావం అలవడుతుందనీ, దేశం గురించి, సమాజం గురించి అవగాహన వస్తుందనీ, పిల్లలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంవల్ల, పోలీసులను పలకరించడంవల్ల వచ్చిన నష్టం ఏమీ లేదని' స్కూల్ టీచర్ నచ్చచెప్పడంతో వాసంతి కాస్త సమాధానపడింది. పువ్వు కోసి అలేఖ్యకు ఇచ్చి పంపేసరికి తొమ్మిది కావస్తోంది.

'అప్పుడే టైమయిపోయింది. ఎమ్మార్వో అసలే చండశాసనుడు' అనుకుంటూ హడావుడిగా పనిలో పడింది వాసంతి.

★★★

శరత్, వాసంతి భార్యాభర్తలు. ఇద్దరూ ఉద్యోగస్థులే.

వాసంతి ఎమ్మార్వో ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ అయితే, శరత్ స్కూల్ టీచర్. మొన్నటివరకూ ఇద్దరి ఉద్యోగాలూ ఒక్కచోటే అయినా ఈమధ్య శరత్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో చెరొకచోట ఉండడం తప్పడంలేదు వారికి.

కానీ తండ్రిని వదిలి ఉండడానికి అలవాటు పడడంలేదు అలేఖ్య. ఆ పరిస్థితి ఇద్దరికీ ఇబ్బందికరంగానే వున్నా ఏమీ చేయలేకపోతున్నారా తల్లిదండ్రులు. శరత్ కూడా ఒక్కడు ఉండలేక వాళ్లమ్మను తోడు తీసుకెళ్లాడు. కనీసం అత్తగారిని అయినా ఇక్కడ ఉండమంటే 'వాడు ఉద్యోగమంటూ తిరిగి ఏ వేళకు వస్తాడు,

ఒక్కడే ఉంటే ఆ కాస్త తిండీ తినడు. నువ్వే ఎలాగోలా సర్దుకోమ్మా' అంటూ కోడలికి నచ్చచెబుతుందామె. ప్రతి శనివారం ఇద్దరూ వచ్చి ఆదివారం ఉండి మర్నాడు ఉదయమే బయలుదేరి వెళ్తారు.

ఆ రెండురోజులు నీళ్ళు, భోజనం కూడా అక్కర్లేదు అలేఖ్యకు. నాన్న కబుర్లు, బామ్మ కథలు చెప్తే చాలు. వాళ్ళు తిరిగి వెళ్ళేటప్పుడు గొడవ చేయడం, మళ్లీ వచ్చే టైమ్ కోసం ఎదురుచూడడం మామూలైపోయింది అలేఖ్యకు.

★★★

"డాడీ!" అంటూ స్కూల్ గేటు దగ్గరే తండ్రిని చుట్టేసింది అలేఖ్య.

"బాగున్నావా కన్నా" ఆప్యాయంగా పలకరించాడు శరత్.

"ఊఁ... బామ్మ కూడా వచ్చేసిందా డాడీ" అడిగింది.

"వచ్చిందమ్మా"

"మరి తను కూడా నీతో స్కూలుకు రావచ్చు కదా"

"మనం ఇప్పుడు బస్సులో వెళ్లకుండా ఇంటివరకూ నడిచే వెళదాం. మరి బామ్మ నడవలేదుకదా. అందుకే ఇంట్లోనే వుండమన్నాను"

"ఓ...సరే" అంటూ ఉత్సాహంగా అడుగులేసింది అలేఖ్య.

స్కూల్ బ్యాగ్ తను తీసుకుంటూ "చెప్పు కన్నా... ఏమేం కబుర్లు" అడిగాడు శరత్.

అడిగిందే తడవుగా అన్ని విషయాలూ చెప్తోంది అలేఖ్య.

స్నేహితులు, స్కూలు, టీచర్లు గురించి కబుర్లే

కబుర్లు. ఇంతలో పోలీస్‌స్టేషన్ కనబడడంతో 'డాడీ! ఇదే పోలీస్‌స్టేషన్. వెళదాం రా'' అంటూ తండ్రిని లాక్కెళ్లింది.

లోపలకు తీసుకెళ్లి "ఈయనే పోలీస్ అంకుల్' అంటూ తండ్రికి పరిచయం చేసింది.

కాసేపు అవీ ఇవీ మాట్లాడాక "మళ్లీ కలుద్దాం'' అంటూ లేచాడు శరత్.

'నైస్‌గర్ల్' అనే కాంప్లిమెంట్‌ను అందుకుని అలేఖ్య కూడా బయల్దేరింది. కూతురికి బొమ్మలు, చాక్లెట్లు కొనిపెట్టి ఇంటికి తీసుకొచ్చాడు శరత్.

"పూర్తయ్యాయా తండ్రీ కూతుళ్ల షికార్లు'' స్కూల్ బ్యాగ్ అందుకుంటూ అడిగింది వాసంతి.

"బామ్మా'' అంటూ వెళ్లి ఆమె ఒడిలో వాలింది అలేఖ్య.

తండ్రి తనకోసం కొన్న బొమ్మలను చూపిస్తూ ఉత్సాహంగా ఏవో కబుర్లు మొదలుపెట్టింది.

రెండురోజులు రెండు క్షణాల్లా గడిచిపోయాయి.

తండ్రి, బామ్మ బయల్దేరుతూ వుండడంతో ఏడుపు ప్రారంభించింది అలేఖ్య.

"డాడీ! ఈరోజు వద్దు. రేపు వెళ్లండి''

"స్కూలుకు వెళ్లాలమ్మా. వెళ్లకపోతే హెడ్‌మాస్టారు ఊరుకోరు'' బుజ్జగించాడు శరత్.

"నువ్వయినా ఉండు బామ్మా''

"నాన్నగారు ఒక్కరే ఎలా ఉంటారమ్మా?''

"అయినా ఏం కాదులే. నువ్వు వుండు'' మొండిగా అంది అలేఖ్య.


"నీ దగ్గర మీ అమ్మ ఉండాలా వద్దా?'' అడిగింది బామ్మ.

"ఉండాలి''

"మరీ డాడీ దగ్గర కూడా వాళ్లమ్మ ఉండాలికదా'' అంటూ నచ్చచెప్పి ప్రయాణమయ్యాడు.

ప్రతివారం ఇలాగే జరుగుతూ ఉండడంతో శరత్, వాసంతిలకు బాధగానే వుంది. ఎవరో ఒకరు ఒక సంవత్సరంపాటు సెలవు పెట్టి ఉందామంటే ఆ తరువాత అయినా తప్పదు కదా అనుకుంటున్నారు.

కొన్నాళ్లయితే అలవాటు అవుతుందని సమాధానపడుతున్న అలేఖ్యలో ఆ ఛాయలేమీ కనిపించడంలేదు వారికి. ఒక్కతే అమ్మాయికదా, పెద్దగా ఖర్చులేముంటాయి,



ఉద్యోగం మానేయకూడదు అని ఒకరికొకరు చెప్పుకుంటారే తప్ప నిజంగా మానేసే ధైర్యం మాత్రం చేయలేకపోతున్నారు.

★★★

"అమ్మా! గవర్నమెంట్ అంటే ఏమిటి?" ఆఫీసు నుండి వచ్చిన తల్లిని అడిగింది అలేఖ్య.

"ఎందుకు కన్నా?"

"చెప్పు ముందు"

"గవర్నమెంట్ అంటే ప్రభుత్వం"

"అబ్బా.. తెలుగులో అర్థంకాదు నేనడిగేది. అసలు ప్రభుత్వం అంటే ఏమిటి?"

"ప్రభుత్వం అంటే మనందరికంటే చాలా పెద్ద. అందరం ప్రభుత్వం చెప్పినట్లే వినాలి. ఎవరికి ఏ సమస్య వున్నా ప్రభుత్వంతో చెప్తే తీర్చేస్తుంది. అంటే చాలా మంచిదన్నమాట" అలేఖ్యకు అర్థ మయ్యే భాషలో చెప్పింది వాసంతి.

"మరి ప్రభుత్వానికి ఆ సమస్యలెలా తెలు స్తాయి?" ప్రశ్నించింది అలేఖ్య.

"సమస్య ఉన్నవాళ్ళు ఆ విషయం ప్రభుత్వా నికి తెలియజేయాలి. అంటే ఉత్తరం రాయాలి"

"మన కాలనీలో ఉందికదా పోస్టాఫీసు. అందులో వేయాలా?"

"అవునమ్మా"

"ఓహో..." అంతా అర్థమైనదానిలా అన్నదా చిన్నారి.

★★★

ప్రభుత్వంగారికి,

నా పేరు అలేఖ్య. మా టీచరు మీరు చాలా పెద్ద వారని చెప్పింది. మా అమ్మ కూడా మీరు చాలా మంచివారనీ, ఎవరికి ఏ సమస్య ఉన్నా తీరుస్తారని చెప్పింది. నాకు కూడా ఒక సమస్య వచ్చిందండీ. మా నాన్నగారు వేరే ఊర్లో ఉద్యోగం చేస్తూ వుంటారు. నేను అమ్మ దగ్గర ఉంటాను. మా నాన్న గారంటే నాకు చాలా ఇష్టం. మా బామ్మంటే కూడా. కానీ వాళ్లిద్దరూ నా దగ్గర ఉండరు. వాళ్లను నా దగ్గర ఉండేలా చేయమని ఈ ఉత్తరం రాస్తున్నాను. నాలాంటి చిన్నపి ల్లలు ఉత్తరం రాస్తే మీరు చదవరేమో అనుకున్నా. నాకు ఒక కథ గుర్తుకు వచ్చి ఈ లెటర్ రాస్తున్నాను.

ఒక పిచ్చుక సముద్రం ఒడ్డున ఒక చెట్టుమీద గూడు కట్టుకుం దిట. ఒకసారి ఆ పిచ్చుక గుడ్లు జారి సముద్రంలో పడిపోయాయిట. అప్పుడా పిచ్చుక తన చిన్న రెక్కలతో సముద్రాన్ని తోడుతూ ఉందిట. దాని ప్రయత్నానికి మెచ్చి దేవుడు సముద్రాన్ని రెండుగా చీల్చాడట. అప్పుడు పిచ్చుక వెంటనే తన గుడ్లు తీసుకుని గూట్లో పెట్టుకుందిట. ఈ కథ నాకు మా బామ్మ చెప్పిందండీ. ఇంతకుముందు బామ్మ నన్ను స్కూలు నుండి తీసుకొచ్చి స్నానం చేయించి టిఫిన్ పెట్టేది. ఇప్పుడు మా అమ్మ తాళం చెవిని పక్కింటి ఆంటీకి ఇచ్చి ఆఫీసుకు వెళుతుంది. నేను స్కూలు నుంచి వచ్చి ఎంత పిలిచినా ఆంటీ ఏమో టీవీ చూసుకుంటూ అస్సలు పట్టించుకోదు. దాంతో అమ్మ వచ్చేవరకూ ఇంటి ముందే కూర్చుంటా. కాబట్టి మీరు నాన్నకి, బామ్మకి మా దగ్గరే ఉండమని చెప్పండి. మా ఫ్రెండ్ రాహుల్ వాళ్లమ్మ కూడా ఉద్యోగం చేసేదట. కానీ రాహుల్ గొడవ చేయడంతో అదేదో ఎంబ్రాయిడరీ షాపట అది పెట్టుకుంది. మా స్కూలు దగ్గరే. రాహుల్‌ని స్కూల్లో దింపి షాపుకు వెళుతుంది. మళ్లీ స్కూలు అయిపోగానే షాపు మూసేసి రాహుల్‌తో కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి వెళుతుంది. అలాంటి షాపేదో అందరు అమ్మలకు ఇవ్వకూడదూ. ఎంచక్కా అందరం హాయిగా ఉండొచ్చు. ఇంకో చిన్న విషయం ప్రభుత్వంగారూ. మా స్కూల్ బస్ ఎప్పుడయినా రాకపోతే మా టీచర్ మమ్మల్ని ఆర్టీసీ బస్సులో ఇంటి దగ్గర దింపుతుంది. ఆ బస్సులో కూర్చోవడానికి సీట్లే వుండవు. మా స్కూలు బ్యాగులు వాళ్లకు తగులుతున్నాయని అంతా మమ్మల్ని నెట్టేస్తూ వుంటారు. స్కూలు పిల్ల లకు కూడా కొన్ని సీట్లు రిజర్వు చేయకూడదూ. అయినా ఇది పెద్ద కోరికేం కాదులెండి. మా బామ్మ నా దగ్గర వుంటే నన్ను చాలా జాగ్రత్తగా ఇంటికి తీసుకువస్తుంది. కానీ మీరు చాలా మంచివారట కదా. అందుకే ఈ విషయం కూడా చెపున్నాను. ఇవన్నీ చేస్తారుకదూ. అప్పుడు మీకు కూడా మా పోలీస్ అంకుల్‌కి ఇచ్చినట్లు గులాబీ పువ్వు ఇస్తూ వుంటాను. అయ్యో! ఇవాళ అసలే శనివారం. మా నాన్నగారు వచ్చే వేళయింది. బోలెడన్ని కబుర్లు చెప్పాలి. ఇక వుంటా ప్రభుత్వంగారూ.

లెటర్ రాయడం పూర్తి చేసి దానిమీద 'ప్రభుత్వం గారికి' అని రాసి పోస్టుబాక్స్‌లో వేసింది అలేఖ్య. ఆ లెటర్ ఎక్కడికి చేరుతుందో, ఎవరికి అందుతుందో! మీకుగానీ అందితే మీ బిజీ షెడ్యూ ల్‌లో కొంత టైం కేటాయించి ఆ లెటర్ కరెక్ట్ అడ్ర స్‌కు చేరేలా చూడరూ. చూస్తారుకదూ.

అలేఖ్య మీకు కూడా గులాబీ పువ్వు ఇస్తూ వుంటుందిలెండి.

★



## పేరు-ప్రతిష్ట

సినిమా తారలు తమ అందంతో అభిమానుల్ని, తమ అభినయంతో పేరు ప్రతిష్ఠల్ని పొందుతుంటారు. కొంతమంది తారలు తమ మాతృదేశంతో పాటూ ఇతర దేశాల్లో కూడా చాలా పాపులర్ అయిపోతారు. ఇప్పుడు కరిష్మా వంతొచ్చినట్టుంది. మన పొరు గదేశమైన పాకిస్తాన్‌లో ఆమె పేరు మారుమ్రో గిపోతోంది. సహారా మనోరంజన్ సీరియల్ 'కరిష్మా-మిరాకిల్స్ ఆఫ్ డెస్టినీ'లో నటిస్తున్న కరిష్మా ఇప్పుడు పాకిస్తాన్ ప్రేక్షకులకి కూడా కనువిందు చేయనుంది. ఈ సీరియల్ శాటిలైట్ హక్కుల్ని సహారా వారు పాకిస్తానీ ఛానెల్ ఎఆ ర్వై గోల్డ్‌కి అమ్మేశారట. త్వరలో ఈ సీరియ ల్‌లో అక్కడ కూడా దర్శనం ఇవ్వనుందిట.

